# వచ్చే నెల ఒకటిన మెగా వైద్యశిబిరం




మాట్లాడుతున్న ప్రకాశరావు

రేపల్లెరూరల్, న్యూస్‌లైన్: వచ్చేనెల ఒకటిన ప్రపంచ ఎయిడ్స్‌డేను సందర్భంగా మెడికల్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పర్చూరి భావన్నారాయణచౌదరి, రత్నమాణిక్యమ్మ జ్ఞాపకార్థం స్థానిక గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఉపాధ్యక్షుడు వేజళ్ల ప్రకాశరావు తెలిపారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో బుధవారం కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ప్రకాశరావు మాట్లాడుతూ మెగా వైద్య శిబిరంలో గుండె, జీర్ణకోశ వ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, మూత్రపిండాలు, కీళ్లు, చర్మవ్యాధులు, షుగర్, పిల్లల సంబంధ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేస్తామన్నారు. శిబిరంలో గుంటూరు, విజయవాడకు చెందిన 11 మంది వైద్యులు హాజరవుతారని తెలిపారు. ఎమ్మెల్యే మోపిదేవి వెంకటరమణారావు, ఎమ్మెల్సీలు సింగం బసవపున్నయ్య, రాయపాటి శ్రీనివాస్, కెఎస్ లక్ష్మణరావు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముమ్మనేని వెంకటసుబ్బయ్య హాజరవుతారని పేర్కొన్నారు. శిబిరాన్ని రేపల్లె ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

## ప్రముఖులకు సన్మానం..

అదే రోజుఎంపీపీ ఆధ్వర్యంలో మాజీ టెస్ట్ క్రికెటర్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు ఎంఎస్‌కే ప్రసాద్, అంతర్జాతీయ విలువిద్య నిపుణురాలు జ్యోతిసురేఖ, పిల్లల వైద్యనిపుణుడు ఆర్.వెంకటేశ్వరావుకు ఘన సన్మానం ఉంటుందన్నారు. కార్యక్రమాలను జయప్రదం చేసేందుకు సభ్యులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ సభ్యులు ఎన్‌బీ.రాజేంద్రప్రసాద్, వడ్లమూడి సాంబశివరావు, జి.రాజశేఖరబాబు తదితరులు పాల్గొన్నారు.